## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ కొత్త లైన్ ఏర్పాటు చేయడానికి పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు. 11 కేవీ ఆర్యనగర్-1, 2, వినాయక్‌నగర్-1 ఫీడర్‌లోని పద్మానగర్‌రోడ్డు నెంబర్-1, హనుమాన్ నగర్, యాదగిరి బాగ్, త్రిమూర్తి వెనకాల, కోటగల్లి, జెండగల్లి, నకాశ్ గల్లి, సాదుల్లా దర్గా, ఆర్య సమాజ్ రోడ్, సిర్నాపల్లి గడి, అంగడి బజార్, దోబీ ఘాట్, గోసంగి కాలనీ, శివాలయం ఏరియా, తెలంగాణ తల్లి స్టాచు, బీమరాయ టెంపుల్, వంద ఫీట్ల రోడ్డు, ఆకుల పాపన్న రోడ్డు, గణేశ్ కాలనీ, అశోక్ అపార్ట్‌మెంట్, సాయి కృపనగర్, కాశినగర్, ఆకుల పాపన్న రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### రమణ సేవలు ఆదర్శం



సంతాపసభలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్ నాగారం: సమాజ బాగుకోసం జీవితాన్ని దారబోసిన టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కందుకూరి రమణ అందరికి ఆదర్శమని డీఈవో అశోక్ అన్నారు. ఆదివారం జిల్లా పెన్షనర్స్, సీనియర్ సిటిజన్ భవన్‌లో రామ్మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన రమణ సంతాప సభ కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కె వేణు గోపాల్, భాస్కర్, శంతన్, సురేశ్, ధర్మేందర్, సత్యానంద్, ఆల్గోట్ రవీందర్, సుధాకర్, షేక్ హుస్సేన్, శ్రీధర్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల సాధికారతకు స్నేహ సొసైటీ కృషి

నిజామాబాద్ నాగారం: స్నేహ సొసైటీ దివ్యాంగుల సాధికారతకు గత 30 ఏళ్లుగా కృషి చేస్తోందని స్నేహ సొసైటీ అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. ఆదివారం స్థానిక మారుతినగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ కార్యాలయంలో వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అంద విద్యార్థులు వివిధ రంగాలలో ప్రావీణ్యాన్ని చూపిస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి ముందు కార్యదర్శి సిద్ధయ్య సొసైటీ వార్షిక నివేదిక, ఏడాది కాలంగా చేపట్టిన కార్యక్రమాలు, నిధులు, ఖర్చుల వివరాలను వివరించారు. అనంతరం జూలై మాసంలో నిర్వహించే పెర్ల్ సెలబ్రేషన్స్ కోసం సావనీర్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జ్యోతి, రాజేశ్వరి, భానుప్రియ, బాలరాజు, వీరేశం, శ్యాంసుందర్, సుధాకర్, డాక్టర్ మహిపాల్, డాక్టర్ సవిత రాణి, దయానంద్, ఎన్ విమల, పరమేశ్వరి, బాబా గౌడ్, జీవన్ రావు, బ్రహ్మానంద రెడ్డి, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి షబ్బీర్ అలీ చేయూత



నిజామాబాద్‌నాగారం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆంగ్లదినపత్రిక ఫొటోగ్రాఫర్ రమణకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అందించిన రూ. 25 వేల నగదును యూనియన్ ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన నాయికిడి రవి ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. డిచ్‌పల్లి గల్ఫ్‌చేయూత సంఘం సభ్యులు ఆదివారం బాధితుడిని పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ. పది వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సభ్యులు జె అశోక్, వెంకటాద్రి, సాయిలు, భాస్కర్, నరేశ్, సురేందర్, సురేశ్ పాల్గొన్నారు.

### కర్రెగుట్ట నరమేధాన్ని ఆపాలి

నిజామాబాద్ సిటీ: తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్ట ప్రాంతం యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తోందని అక్కడ జరుగుతున్న నరమేధాన్ని వెంటనే ఆపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ద్వారకానగర్ నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఆదివాసి, గిరిజనులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, వేల్పూరు భూమయ్య, రమేశ్, భాస్కర్, నర్సింగ్ రావు, లక్ష్మి, రేఖ పాల్గొన్నారు.

# అపరిశుభ్రతకు కేరాఫ్ విలీన గ్రామాలు

- దుర్గంధం వెదజల్లుతున్న డ్రైయినేజీలు
- ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం
- దోమలతో కాలనీవాసుల సావాసం
- పట్టించుకోని అధికారులు



మారుతీనగర్‌లో పేరుకుపోయిన చెత్త



ముబారక్‌నగర్‌లో డ్రైయినేజీ లేక రోడ్డు పక్కన ప్రవహిస్తున్న మురుగునీరు



గంగాస్థాన్‌లో రోడ్డు పక్కన ప్రవహిస్తున్న మురుగు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ నగర పాలక సంస్థలో విలీనమైన పలు గ్రామాలు అపరిశుభ్రతకు చిరునామాగా నిలుస్తున్నాయి. రూరల్ మండల పరిధిలోని గంగాస్థాన్ ఫేజ్-1, 2, మారుతీనగర్, ముబారక్‌నగర్, గూపన్‌పల్లి, మాధవనగర్, కాలూర్, ఖానాపూర్ ప్రజలు పారిశుధ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పలుచోట్ల డ్రైయినేజీలు లేక మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు చెబుతున్నారు.

**దోమల బెడద ఉంది**

మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో దోమల బెడద తీవ్రమవుతుంది. దీంతో అనారోగ్యానికి గురవుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలలో డ్రైయినేజీలను నిర్మించాలి.

– శంకర్, ముబారక్‌నగర్

**అధికారులు చొరవ తీసుకోవాలి**

మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలి. కాలనీలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలి. డ్రైయినేజీలను శుభ్రపరచాలి.

– నర్సయ్య, గంగాస్థాన్

# కాంగ్రెస్‌కు రైతులపై శ్రద్ధ లేదు



శ్రద్ధానంద్‌గంజ్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

సుభాష్‌నగర్: ప్రభుత్వానికి కమిషన్లపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. రాత్రి కురిసిన అకాల వర్షంతో శ్రద్ధానంద్ గంజ్‌లోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజ కొంటాం అని గొప్పలు పలికిన రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోలులో పూర్తిగా విఫలమైందన్నారు. రైతన్నలు పండించిన పంటను అమ్మేందుకు నానా తంటాలు పడుతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు, హమాలీ, లారీల కొరతతో రైతన్నలు మండుటెండలో రోజుల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 40 శాతం కూడా వడ్ల కొనుగోళ్లు జరగలేదని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైస్ మిల్లర్ల, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పలు సమస్యలపై జాయింట్ కలెక్టర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఏఎంసీ గంజ్ ఇన్‌చార్జి శకుంతల, బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిర్‌పూర్‌లో బడిబాట



బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సుభాష్‌నగర్: మండలంలోని సిర్‌పూర్‌లో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం బడిబాట నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ గ్రామంలోని విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న పుస్తకాలు, డ్రెస్సులు మధ్యాహ్నం భోజనం, పాఠశాల విద్యార్థులు గతేడాది సాధించిన రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి బహుమతులను తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల విద్యార్థులు రాసిన 'సిరిలేఖలు' పుస్తకాన్ని అందరికి అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి సత్యనారాయణ, ఉపాధ్యాయులు డాక్టర్ కాసర్ల గ్రామ పెద్దలను కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పి బలోపేతం చేయాలని కోరారు.

# ముగిసిన వేసవికాల బైబిల్ తరగతులు



విద్యార్థులతో పాస్టర్ రెవరెండ్ దినకర్

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ సీఎస్ఐ వెస్లీ చర్చిలో కొనసాగుతున్న వేసవికాల బైబిల్ తరగతులు ఆదివారం ముగిసినట్లు ప్రెసిబిటర్ ఇన్‌చార్జి, జీడీసీసీ సండే స్కూల్ సెక్రెటరీ రెవరెండ్ జి దినకర్ తెలిపారు. అనంతరం తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జి ఇందిర, టి రాజు, ఎన్ దేవరాజ్, ప్రతిమ, కృప తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన విద్యార్థుల నృత్యాలు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అదిరేటి స్టెప్పులు వేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుధాకర్, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ నరేశ్, కొయ్యాడ శంకర్, సందేశ్, సందీప్, శ్రీనివాస్, నిసార్ అలీ, మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, నాయకులు



తెయూలో జెండాను ఎగురవేస్తున్న విద్యార్థులు



పడకల్ నుంచి వెళ్తున్న నాయకులు



సిరికొండలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ వేడుకలను నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఊరూరా పార్టీ జెండాలను ఎగురవేసిన నేతలు, వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభకు తరలివెళ్లారు. అర్బన్ నియోజకవర్గం నుంచి 52 బస్సులు, 270 కార్లలో 3,500 మంది కార్యకర్తలు, నాయకులు సభకు వెళ్లారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, మోపాల్, డిచ్‌పల్లి మండలాల నుంచి కార్యకర్తలు భారీగా పయనమయ్యారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం గులాబీ జెండాను ఎగురవేసి కార్యకర్తలు, నాయకులతో కలిసి సభకు తరలివెళ్లారు.



ఘన్‌పూర్ నుంచి వెళ్తున్న నాయకులు

### రజతోత్సవ సభలో మహిళా నేతలు



నిజామాబాద్ అర్బన్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో జిల్లాకు చెందిన మహిళా నాయకులు పాల్గొన్నారు. సభా వేదికపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు మాజీ మేయర్ నీతూకిరణ్, మాజీ జెడ్పీటీసీ గడ్డం సుమనరెడ్డి, విశాలినిరెడ్డి తదితరులు కలిశారు.

### ఖిల్లా రఘునాథ ఆలయంలో రామరక్ష స్తోత్ర పారాయణం



నిజామాబాద్ రూరల్: మానవ జీవితాన్ని సంస్కరించ గల మహా కావ్యం శ్రీ రామాయణం అని ప్రముఖ వేద పండితుడు గోసాం దత్తు శాస్త్రి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో బ్రాహ్మణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 16వ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక శ్రీ రామ స్తోత్ర పారాయణం, హనుమాన్ చాలీసాను పఠించారు. కార్యక్రమంలో ప్రమోద్, మారుతీ జోషి, ప్రమోద్ హర్గే, న్యాలం శ్రీ నివాస్, చంద్ర శేఖర్‌శర్మ, మనోహర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# పహల్గాం అమరులకు నివాళి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి నెట్‌వర్క్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన పర్యాటకులకు జిల్లా ప్రజలు నివాళులర్పించారు. ఆదివారం నిజామాబాద్ నగరంతోపాటు ఆయా మండలాల్లో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. నగరంలో ఇందూరు గాయత్రి బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య ఆధ్వర్యంలో పెద్దబజార్ నుంచి గాంధీచౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. పులాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. ఉగ్రదాడిని నిరసిస్తూ సిరికొండ మండల కేంద్రంలో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ముక్తకంఠంతో ఖండించాలని భవన నిర్మాణ రంగ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి(కల్లెడి) గంగాధర్ తెలిపారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు.

# ప్రధాని మన్ కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు





జిల్లా కేంద్రంలో మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే, నాయకులు, సిరికొండలో..

సుభాష్‌నగర్: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నగరంలోని 27వ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్డింగ్ నారాయణ స్వగృహంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పార్టీ నాయకులతో కలిసి వీక్షించారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కశ్మీర్‌లో శాంతి భద్రత, విద్యా వ్యవస్థ బలోపేతం, ప్రజాస్వామ్యం పటిష్టం, పర్యాటక రంగ అభివృద్ధిని చూసి శత్రువులు జీర్ణించుకోలేక పోతున్నారని మోదీ సందేశాన్ని ఇచ్చారు. పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతి భారతీయుడి రక్తం మరుగుతోందని ఉగ్ర దాడికి తప్పక జవాబు ఇచ్చి తీరుతామని అన్నారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు ఉన్నాయని, ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసే చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సిరికొండలో..**

సిరికొండ: ప్రధాని మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యమాన్ని బీజేపీ నాయకులు సిరికొండ మండల కేంద్రంలో వీక్షించారు. నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బాబురావు, రాజేందర్, రంజిత్‌రెడ్డి, కిరణ్, గోపి, మారుతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



జిల్లా కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్క సుధాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) ఆధ్వర్యంలో మున్సిపల్ డ్రైవర్లు, కార్మికులు మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బల్దియా కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలన్నారు. మేడే స్ఫూర్తితో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం కోసం, ఉద్యోగ, సామాజిక భద్రత కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, శాంతికుమార్, విజయ్, లక్ష్మణ్, సంతోష్ గౌడ్, సాయిలు, నరేశ్, భూపతి, జగదీశ్, గంగమణి, యాదమ్మ, శైలజ, శ్రీధర్, నాగరాజు, అశోక్, విజయలక్ష్మి, గంగాధర్, సాయిలు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నిజామాబాద్ రూరల్: తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం జెడ్పీ హాల్‌లో ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడిగా జి భాస్కర్, అసోసియేట్ అధ్యక్షుడిగా బి శంకర్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం ప్రదీప్‌కుమార్, కోశాధికారిగా ఎన్ విఠల్, ఉపాధ్యక్షులుగా సునీతాదేవి, నవీన్‌కుమార్, ఎండీ అహ్మద్‌అలీ, సాయిసతీశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా జి పద్మ, వై శంకర్, సీహెచ్ రాకేశ్‌కుమార్, విజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లుగా భీమ్‌రావు, ఎం లక్ష్మీనారాయణ, జేఏసీ మెంబర్లుగా సీహెచ్ నరేశ్, ఆర్ బాగయ్య, సిద్ధు పటేల్, ఆర్ గంగాధర్ ఎన్నికయ్యారు.

**పద్మశాలి సంఘం తర్ప 49..**

నిజామాబాద్ నాగారం: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న పద్మశాలి సంఘం తర్ప 49 నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంకం రాజేందర్, జనరల్ సెక్రెటరీగా గజం సుదర్శన్, ట్రెజరర్‌గా ఎస్ వెంకటలక్ష్మణ్ ఎన్నికయ్యా రు. అనంతరం నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు.

**వాకర్స్ అసోసియేషన్..**



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రాజారాం స్టేడియంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా నజారుద్దీన్, ఉపాధ్యక్షుడిగా సురేందర్, కోశాధికారిగా వెంకటేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 98,000 | వెండి(కిలో) | 1,03,000 |
| 22 క్యారెట్స్ | 90,465 | | |

– నిజామాబాద్ బిజినెస్

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 200 |
| | | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 10 | 20 | గాజరుగడ్డ | 40 | 80 |
| బెండకాయ | 35 | 50 | పచ్చిమిర్చి | 40 | 60 |
| బీరకాయ | 50 | 80 | దోసకాయ | 12 | 24 |
| దొండకాయ | 25 | 50 | ఆలుగడ్డ | 25 | 50 |
| బీర్నీసుకాయ | 100 | 150 | గోబిగడ్డ | 12 | 24 |
| కాకరకాయ | 35 | 60 | గోబిపువ్వు | 35 | 60 |
| వంకాయ | 20 | 40 | బీట్‌రూట్ | 20 | 40 |
| పాలకూర | 15 | 30 | కరివేపాకు | 60 | 100 |
| మెంతికూర | 70 | 100 | చామగడ్డ | 60 | 80 |
| కొత్తిమీర | 25 | 50 | గోరుచిక్కుడు | 40 | 60 |
| పుదీనా | 40 | 60 | చిక్కుడుకాయ | 50 | 80 |
| క్యాప్సికం | 50 | 80 | మామిడికాయ | 20 | 40 |

–సుభాష్‌నగర్

## సినిమాలు

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

స్క్రీన్-1 జింఖానా(తెలుగు)-11.00, 4.40, 7.40, 10.30
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-1.40
స్క్రీన్-2 సారంగపాణి జాతకం(తెలుగు)- 10.40, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-3 చౌర్యపాఠం(తెలుగు)-11.0
సూర్యపేట జంక్షన్(తెలుగు)-4.40, 10.20
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-7.30

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

స్క్రీన్-1 సారంగపాణి జాతకం(తెలుగు)- 10.40, 1.30, 4.20, 7.10, 10.00
స్క్రీన్-2 శివశంభో(తెలుగు)-11.10
జింఖానా(తెలుగు)-10.40
స్క్రీన్-3 జింఖానా(తెలుగు)-11.25, 7.25
చౌర్యపాఠం(తెలుగు)- 2.20
స్క్రీన్ -4 ఏఎల్‌సీసీ ఓ యునివర్సల్ బ్యాచ్‌లర్ -11.25
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి(తెలుగు)-2.00
సోదరా(తెలుగు)-7.35
సూర్యపేట జంక్షన్(తెలుగు)-10.25

**లలితామహల్** సారంగపాణి జాతకం (తెలుగు)
**దేవి** జింఖానా(తెలుగు)-11.00 2.00
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి (తెలుగు)- 6.00 10.00
**నటరాజ్** సూర్యాపేట్ జంక్షన్ (హిందీ)
**విజయ్** మ్యాడ్ స్క్వేర్ (తెలుగు)